BHARATH SAMACHAR DIGITAL

26, అక్టోబర్ 2026, సోమవారం భారత్ సమాచార్

స్వామి శాగంటికి అరుదైన గుర్తింపు



భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న స్వామి శాగంటికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా సేవలందిస్తున్న ఆయన ప్రతిష్ఠాత్మకమైన ఇండియా స్కూల్ లీడర్‌షిప్ అవార్డు–2026 అందుకున్నారు. అక్టోబర్ 25, 2026న న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన ఇండియా స్కూల్ లీడర్‌షిప్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

వరల్డ్ అలయన్స్ ఆఫ్ స్కూల్ ప్రిన్సిపల్స్ (WASP) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాలకు చెందిన విద్యావేత్తలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యారంగ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. విద్యారంగంలో నాయకత్వ లక్షణాలు, వినూత్న ఆలోచనలు, పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడంతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే అంశాలపై ఈ వేదిక దృష్టి సారించింది.

ఈ కార్యక్రమంలో WASP వ్యవస్థాపక సీఈఓ డాక్టర్ దీప్ శిఖ స్వామి శాగంటికి పురస్కారాన్ని అందించారు. ముఖ్య అతిథులుగా AAFI ఛాన్సలర్ డాక్టర్ సందీప్ మార్వా, అమెరికాలోని ప్యూర్టో రికోకు చెందిన ప్రముఖ విద్యా వ్యాపారవేత్త డాక్టర్ వర్జీనియా రివేరా పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి వినూత్న బోధన

స్వామి శాగంటి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్నారు. పాఠ్యాంశాలను బోధించడానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.



వినూత్న బోధనా పద్ధతులను ఉపయోగిస్తూ విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడంతో పాటు, ఉన్నత విద్యను అభ్యసించేందుకు, భవిష్యత్తులో మెరుగైన అవకాశాలను

అందిపుచ్చుకునేందుకు ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగేందుకు అయన చేస్తున్న కృషికి ఈ జాతీయ పురస్కారం గుర్తింపుగా నిలిచింది.

అందరి సహకారంతోనే జాతీయ గుర్తింపు

తనకు జాతీయ స్థాయి పురస్కారం లభించడం పట్ల స్వామి శాగంటి సంతోషం వ్యక్తం చేస్తూ, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, సమాజం అందిస్తున్న ప్రోత్సాహం, సహకారమే ఈ గుర్తింపునకు ప్రధాన కారణమని తెలిపారు. ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకోవడానికి, కొత్త బోధనా పద్ధతులను తెలుసుకోవడానికి, విద్యారంగంలో మరింత మెరుగైన సేవలు అందించడానికి ఇలాంటి జాతీయ, అంతర్జాతీయ వేదికలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

పాఠశాల వర్గాల హర్షం

మేచరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు స్వామి శాగంటి జాతీయ పురస్కారం అందుకోవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంగతాయితో పాటు ఉపాధ్యాయ బృందం, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సాధించిన ఈ గుర్తింపు ఇతర ఉపాధ్యాయులకు కూడా స్ఫూర్తినిస్తుందని అభిప్రాయపడ్డారు. స్థానిక పాఠశాలలో పనిచేస్తూ జాతీయ స్థాయి వేదికపై గుర్తింపు పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

© 2026 Bharath Samachar